సాక్షి
వికారాబాద్
గురువారం । 13 । జూన్ । 2024

న్యూస్‌రీల్

స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌కు విద్యార్థుల ఎంపిక



విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందజేస్తున్న ప్రిన్సిపాల్ శంకర్‌బాబు

కొడంగల్: పట్టణ శివారులోని మహాత్మా జ్యోతి బాపూలే గురుకుల పాఠశాల నుంచి స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ భువనగిరికి 8 మంది విద్యార్థులు ఎంపికై నట్లు ప్రిన్సిపాల్ శంకర్‌బాబు బుధవారం తెలిపారు. కొడంగల్ గురుకుల పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న విద్యార్థులు ఎస్‌ఓఈ ప్రవేశ పరీక్ష రాసినట్లు తెలిపారు. ఎనిమిది మంది విద్యార్థులు అర్హత సాధించినట్లు చెప్పారు. ప్రస్తుత విద్య సంవత్సరంలో ఈ విద్యార్థులు 8వ తరగతిలో చేరుతారని తెలిపారు. ఇంటర్మీడియెట్ వరకు ఉచితంగా ఎంజేపీ గురుకుల పాఠశాలలో విద్యా బోధన ఉంటుందన్నారు. నీట్ లెవల్‌లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తారని చెప్పారు. ఎంపికైన విద్యార్థులను అభినందించి పాఠ్యపుస్తకాలు అందించి పంపించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

లక్కీ డ్రా ద్వారా విద్యార్థుల ఎంపిక



లక్కీ డ్రా ద్వారా విద్యార్థులను ఎంపిక చేస్తున్న లింగ్యానాయక్

అనంతగిరి: బెస్ట్ అవైలేబుల్ పాఠశాలల్లో ఖాళీల భర్తీకి లక్కీ డ్రా ద్వారా విద్యార్థులను ఎంపిక చేసినట్లు అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ బుధవారం తెలిపారు. 3, 5, 8వ తరగతుల్లో 30 ఖాళీలు ఉండగా 60 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి ఎస్ మల్లేశం, ఏఓ భువనేశ్వరిదేవి తదితరులు పాల్గొన్నారు.

సర్వే పనులతో అంగన్‌వాడీలపై పనిభారం

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న రాజు, అంగన్‌వాడీ టీచర్లు

కొందుర్గు: మిషన్ భగీరథ సర్వే పనుల నుంచి అంగన్‌వాడీ టీచర్లను మినహాయించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు డిమాండ్ చేశారు. ఈ విషయమై బుధవారం జిల్లేడ్ చౌదరిగూడ తహసీల్దార్ జగదీశ్వర్‌కు ఆయన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే అంగన్‌వాడీ టీచర్లు పని ఒత్తిడితో ఇబ్బందులు పడుతున్నారని, వాటికి తోడు సర్వే పనులు అప్పగించడం మరింత భారంగా మారిందని అన్నారు. ప్రభుత్వం ఈ విషయమై పునరాలోచించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు గోపాల్, అంగన్‌వాడీ టీచర్లు ఊర్మిళ, అనసూయ, శోభ, తిరుమలమ్మ, మంగమ్మ, స్వప్న, శోభ, ఇందిర, రాణి, సుగుణ, పద్మ, విజయలక్ష్మి పాల్గొన్నారు.

అర్హులకు పథకాలు అందేలా చూడండి

జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి

మంచాల: ప్రభుత్వ పథకాలు అర్హులకు చేరవేయాలని జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం ఆయన పర్యటించారు. నోములలో బడిబాట కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, దుస్తులు పంపిణీ చేశారు. లింగంపల్లిలో అమ్మ ఆదర్శ పాఠశాల, నర్సరీని పరిశీలించారు. మంచాలలోని పల్లె ప్రకృతి వనం, నర్సరీని సందర్శించారు. నర్సరీలో పంచాయతీ కార్యదర్శి రాజ్‌కుమార్ ప్రత్యేక చొరవతో ఫాంపండ్ గోతిని ఏర్పాటు చేసి మొక్కలకు నీటిని సరఫరా చేసే విధానం చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. హరితహారంలో ప్రజలందరినీ భాగస్వాములను చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ బాలశంకర్, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు రాజ్‌కుమార్, శిరీష, ప్రధానోపాధ్యాయుడు రాజిరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు జయానందం తదితరులు పాల్గొన్నారు.

అనంతగిరి: శివారెడ్డిపేట జెడ్పీహెచ్‌ఎస్‌లో ముచ్చటిస్తున్న విద్యార్థులు



జిల్లా వ్యాప్తంగా బుధవారం పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. కొత్త యూనిఫాం.. స్కూల్ బ్యాగ్‌తో విద్యార్థులు బడిబాట పట్టారు. ఉదయం 8:30గంటలకు బడి గంటలు మోగాయి. స్కూళ్ల వద్ద చిన్నారుల సందడి కనిపించింది. పాఠశాలలను మామిడి తోరణాలతో ముస్తాబు చేశారు. మొదటి రోజు తరగతి గదుల్లో పిల్లలు సరదాగా గడిపారు.



తాండూరు రూరల్: మల్కాపూర్ పాఠశాలలో విద్యార్థులకు స్వాగతం పలుకుతున్న ఉపాధ్యాయులు



దోమ: దిర్సంపల్లి ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు పుస్తకాలు ఇస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి



తాండూరు నంబర్ వన్ ప్రభుత్వ పాఠశాలలో బడి గంట కొడుతున్న సిబ్బంది

వామ్మో ఇన్ని ఖాళీలా!

ప్రభుత్వ పాఠశాలల్లో 900 పైచిలుకు ఉపాధ్యాయ పోస్టులు ఖాళీ

విద్య ప్రాథమిక హక్కు.. ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య.. ఉచితంగా పాఠ్యపుస్తకాలు.. యూనిఫాంలు.. మౌలిక వసతులు.. ఈ మాటలు వినడానికి బాగానే ఉన్నా.. చదువు చెప్పే ఉపాధ్యాయులు లేకపోతే ఎన్ని ఉన్నా ఫలితం ఉండదు. జిల్లాలో ఇలాంటి పరిస్థితే ఉంది. సర్కారు బడుల్లో ఏటా ఫలితాలు పడిపోతున్నా దిద్దుబాటు చర్యలు చేపట్టడంలో ఇటు అధికారులు, అటు ప్రభుత్వం పూర్తిగా విఫలమవుతున్నాయనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

- పిల్లల చదువుపై తీవ్ర ప్రభావం
- గత ఏడాది 'పది'లో రాష్ట్రంలోనే చివరి స్థానం
- మూడేళ్లుగా విద్యా వలంటీర్లను నియమించని అధికారులు
- వసతులూ అంతంత మాత్రమే
- అసంపూర్తిగా మన ఊరు – మనబడి పనులు
- అమ్మ ఆదర్శ పాఠశాలల్లోనూ ఇదే పరిస్థితి

వికారాబాద్: వేసవి సెలవుల్లో ఆహ్లాదంగా ఆటపాటలతో గడిపి బడిబాట పట్టిన విద్యార్థులకు మళ్లీ సమస్యలే స్వాగతం పలుకుతున్నాయి. విద్యా హక్కు చట్టం అమల్లోకి వచ్చి పదేళ్లు దాటినా సరైన బోధన, కనీస వసతులకు నోచుకోవడం లేదు. మన ఊరు – మన బడి లాంటి ప్రతిష్టాత్మక కార్యక్రమాలు నిర్వహించినా 10శాతం పనులు కూడా కాకపోవడం పథకాల అమలు తీరుకు అద్దం పడుతోంది. ఇటీవల అమ్మ ఆదర్శ పాఠశాలల పేరిట అభివృద్ధి, మరమ్మతు పనులు చేపట్టినా నిర్మాణ దశలోనే ఉన్నాయి. మౌలిక వసతుల కల్పనలో కొంత ముందడుగు పడినా ఉపాధ్యాయుల కొరతతో ప్రస్తుత విద్యా సంవత్సరంలో పెద్దగా మార్పు కనిపించేలా లేదు.

వెంటాడుతున్న ఉపాధ్యాయుల కొరత

జిల్లాలో మొత్తం 1,063 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా వీటిలో 85,000 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ప్రతి ఏటా పాఠశాలల పునఃప్రారంభం నాటికి పాఠ్యపుస్తకాలు బడులకు చేరడంలో జాప్యం జరిగేది. ఈ ఏడాది వారం రోజులు ముందుగానే పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు బడులకు చేర్చారు. 71,304 మంది విద్యార్థులకు యునిఫారాలను సిద్ధంగా ఉంచారు. పాఠశాలల పునఃప్రారంభం రోజే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యునిఫారాలు, నోటు పుస్తకాల పంపిణీ ప్రక్రియను ప్రారంభించారు. జిల్లా వ్యాప్తంగా 900 పైచిలుకు ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. చాలా ఏళ్లుగా ఈ పరిస్థితి ఉంది. గతంలో విద్యా వలంటీర్లను నియమించారు. దీంతో కొంత మేర సమస్య తీరింది. మూడేళ్ల నుంచి వలంటీర్లు లేకపోవడంతో బోధన గాడి తప్పుతోంది. ఈ సారి కూడా చాలీచాలని ఉపాధ్యాయులతోనే బడులను నెట్టుకొచ్చే ప్రయత్నం చేస్తున్నారు. విద్యాశాఖలో పర్యవేక్షణాధికారులు, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల పోస్టులు పెద్ద సంఖ్యలో ఖాళీగానే ఉన్నాయి. పాఠశాలల పర్యవేక్షణలో కీలక భూమిక పోషించే డిప్యూటీ డీఈఓ వ్యవస్థకు స్వస్తి పలకగా 20 మండలాలకు ఒక్కరు రెగ్యులర్ ఎంఈఓతో నెట్టుకొస్తున్నారు. 94 జీహెచ్‌ఎం పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో పర్యవేక్షణ గాలిలో దీపంలా మారింది. ఈ ప్రభావం విద్యార్థులు సాధిస్తున్న ఫలితాల్లో కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. మూడేళ్లుగా 10వ తరగతి ఫలితాల్లో రాష్ట్రంలో చివరి వరుసలో నిలుస్తూ వస్తోంది. ఇకనైనా పరీక్షల సమయంలోనే హడావిడి చేయకుండా అకాడమిక్ మానిటరింగ్ విషయంలోనూ దృష్టి సారించాలని విద్యాభిమానులు, విశ్లేషకులు సూచిస్తున్నారు.



సిద్దులూరు పాఠశాలలో యూనిఫాంలు పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు

'ప్రైవేటు'లో ఇష్టారాజ్యంగా..

ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. నిబంధనలను తుంగలో తొక్కుతున్నారు. వసతులు, ఫీజుల విషయంలో ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు.

నిబంధనలు పాటించాల్సిందే



ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు అనే తేడా లేకుండా కరికులం, టైమింగ్ నిబంధనలు పాటించాల్సిందే. ప్రైవేటు పాఠశాలల్లో పుస్తకాలు, యూనిఫాంలు, నోట్ బుక్స్, ఇతర సామగ్రి విక్రయించరాదు. దీనిపై అన్ని స్కూళ్ల యాజమాన్యాలకు ఆదేశాలు జారీ చేస్తాం. ప్రభుత్వ పాఠశాలల్లో పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలు పంపిణీ చేస్తున్నాం.

– రేణుకాదేవి, డీఈఓ



ఇళ్ల నుంచి చెత్త సేకరిస్తున్న పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు

వేతనాలు రాక.. వెతలు తీరక

- మూడు నెలలుగా జీతాలకు నోచుకోని గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు
- కుటుంబ పోషణ కష్టంగా ఉందని ఆవేదన

నందిగామ: గ్రామాలే దేశానికి పట్టుగొమ్మలని జాతిపిత మహాత్మా గాంధీ ఆనాడే పేర్కొన్నారు. గ్రామాభివృద్ధే, దేశాభివృద్ధి అని ప్రజాస్వామ్యవాదులు చాలా సందర్భాల్లో విశ్లేషించారు. అలాంటి గ్రామాలలో అన్ని రకాల మౌలిక వసతులు కల్పించడమే కాకుండా పారిశుద్ధ్య పనులు చేసే కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లించాలి. కానీ మూడు నెలలుగా ప్రభుత్వం నుంచి కార్మికులకు జీతాలు అందకపోవడంతో తీవ్ర ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతున్నారు. రెక్కాడితేగాని డొక్కాడని పరిస్థితుల్లో సమయానికి వేతనాలు రాక తీవ్ర ఇక్కట్లు శ్రమజీవులు పడుతున్నారు. నందిగామ మండలంలోని 18 గ్రామ పంచాయతీలు ఉండగా ఇటీవల అంతిరెడ్డిగూడను సైతం జీపీగా ఏర్పాటు చేశారు. దీంతో మండలంలో గ్రామ పంచాయతీల సంఖ్య 19కి చేరుకుంది. ఆయా గ్రామ పంచాయతీలలో 108 మంది కార్మికులు పనిచేస్తున్నారు. వారికి మూడు నెలల నుంచి వేతనాలు చెల్లించడం లేదు.

అల్లాడిపోతున్నాం..

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని గ్రామ కార్యదర్శితో పాటు మండల స్థాయి అధికారులు పంచాయతీ కార్మికులపై ఒత్తిడి చేస్తుంటారు. వాటిని తట్టుకొని మురుగు కాల్వలతో పాటు, చెత్త చెదారాలను ఎప్పటికప్పుడు తొలగిస్తుంటారు. గ్రామంలో ఎక్కడ ఏ సమస్య వచ్చినా గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య సిబ్బందే కీలకం. అలాంటి సిబ్బందికి మూడు నెలలుగా వేతనాలు లేక అల్లాడిపోతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. 19 గ్రామ పంచాయతీలో కొన్ని గ్రామాలు మినహా అధిక గ్రామ పంచాయతీలలో వేతనాలు అందడం లేదని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలలు పునఃప్రారంభమైన నేపథ్యంలో తమ పిల్లలకు దుస్తులు, పుస్తకాలు తదితర వాటిని తీసుకునేందుకు డబ్బులు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని ఆవేదన వెలిబుచ్చుతున్నారు. దీనికి తోడు అనారోగ్యాలకు గురైతే కనీసం మందులు కొనుగోలు చేసేందుకు సైతం డబ్బులు లేవని దీనస్థితిని వ్యక్తం చేస్తున్నారు. గ్రామ పంచాయతీ చెక్కులు ఎస్‌టీఓలో చెల్లుబాటు కాలేకపోవడం, 15వ ఆర్థిక సంఘం నిధులు సకాలంలో రాకపోవడంతోనే గ్రామ పంచాయతీ కార్మికులకు వేతనాలు సకాలంలో అందించలేక పోతున్నామని ఉన్నతాధికారులు చేతులు దులుపుకొంటున్నారని కార్మికులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గ్రామ పంచాయతీ కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

అధికారుల నిర్లక్ష్యంతోనే జాప్యం

- హైదరాబాద్ – బీజాపూర్ జాతీయ రహదారి విస్తరణ పనులపై నేతల మండిపాటు

చేవెళ్ల: హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారి విస్తరణ పనుల్లో జాప్యానికి అధికారులు, కాంట్రాక్టర్ మోగా ఇంజనీరింగ్ సంస్థ నిర్లక్ష్యమే కారణమని రాష్ట్ర కాలుష్య నియంత్రణ బోర్డు సభ్యుడు చింపుల సత్యనారాయణరెడ్డి, మాజీ డీసీసీ అధ్యక్షుడు పడాల వెంకటస్వామి ఆరోపించారు. చేవెళ్లలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రోడ్డు విస్తరణ పనులు జాప్యం ఎందుకు జరుగుతుందని నేషనల్ హైవే అధికారులను అడిగితే సమాధానం చెప్పడం లేదన్నారు. రోడ్డు పక్కన ఉన్న మర్రి చెట్ల తొలగింపుపై గ్రీన్ ట్రిబ్యునల్ అనుమతి కోసం ఇన్ని రోజులు ఆలస్యమైందని పేర్కొనడం హాస్యాస్పదం అన్నారు. చెట్ల తొలగింపుపై ఎంత నష్టం జరుగుతుందని ప్రశ్నిస్తే సమాధానం లేదన్నారు. మోగా ఇంజనీరింగ్ సంస్థకు లాభం చేకూర్చేలా అధికారులు కుమ్మక్కై రోడ్డు విస్తరణ పనుల్లో జాప్యం చేస్తున్నట్లు అనుమానాలు ఉన్నాయని ఆరోపించారు. చెట్ల సాకుతో పనుల్లో నిర్లక్ష్యం చేయడం ఎంతవరకు సమంజసమని అన్నారు. కేంద్ర ప్రభుత్వం 2018లోనే ఈ రోడ్డును జాతీయ రహదారి విస్తరణ కిందికి ఎంపిక చేసిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దాదాపు రూ.100 కోట్లకు పైగానే భూసేకరణకు కేటాయించాయి. సదరు కాంట్రాక్టర్‌కు అప్పగించిన కూడా పనులు చేయకుండా గ్రీన్ ట్రిబ్యునల్‌లో వేసిన కేసును సాకుగా చూపుతున్నారన్నారు.

ముఖ్యమంత్రిని కలుస్తాం

రోడ్డు విస్తరణపై కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గం ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని త్వరలోనే కలిసి సమస్యను వివరిస్తామని చెప్పారు. ఈ రోడ్డుపై నిత్యం అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని, ఎంతో మంది చనిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తప్పకుండా కాంగ్రెస్ పార్టీ హయాంలో రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేయించేందుకు కృషి చేస్తామని వారు పేర్కొన్నారు. సమావేశంలో టీపీసీసీ సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, నాయకులు ఆగిరెడ్డి, పెంటయ్యగౌడ్, వీరేందర్‌రెడ్డి, ఎంపీటీసీ రాములు, రమేష్, బాలయ్య, నర్సింలు, రాంరెడ్డి, మానిక్యం తదితరులు పాల్గొన్నారు.

టీచర్ల కొరత లేకుండా చూస్తాం

స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

ధారూరు: త్వరలో మెగా డీఎస్సీ నిర్వహించి ఉపాధ్యాయుల కొరత లేకుండా చూస్తామని, ఇందుకోసం సీఎం రేవంత్‌రెడ్డి సిద్ధంగా ఉన్నారని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ తెలిపారు. బుధవారం మండలంలోని కేరెళ్లి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు జెడ్పీ చైర్‌పర్సన్ పట్నం సునీతారెడ్డి, కలెక్టర్ నారాయణరెడ్డితో కలిసి యూనిఫారాలు, పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. అనంతరం డిజిటల్ ప్యానల్ బోర్డు గదిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా 26 లక్షల మంది విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. 26,825 అమ్మ ఆదర్శ పాఠశాలను ప్రారంభించడం జరిగిందన్నారు. గత ప్రభుత్వం ఒక్కసారి కూడా డీఎస్సీ వేయలేదని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి త్వరలో మెగా డీఎస్సీ వేయనున్నట్లు ప్రకటించారు. దీంతో రాష్ట్రంలో టీచర్ల కొరత తీరబోతుందని అన్నారు. ఉపాధ్యాయుల కొరతను అధిగమించేందుకు త్వరలో 317 జీఓను సవరించి, సబ్ కమిటీ ద్వారా ఇతర జిల్లాలకు వెళ్లిన టీచర్లను తిరిగి రప్పిస్తామని తెలిపారు. కేరెళ్లి గ్రామంలో ఏర్పాటు చేసిన బీసీ గురుకుల పాఠశాల ప్రస్తుతం షాబాద్‌లో కొనసాగుతోందని, దాన్ని త్వరలో ఇక్కడే ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ విజయలక్ష్మి, ఎడ్యుకేషన్ స్టేట్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ మల్లయ్య భట్టు, డీఈఓ రేణుకాదేవి, పీసీసీ ప్రధాన కార్యదర్శి రఘువీరారెడ్డి, మండల అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి పెద్ద పీట

మోమిన్‌పేట: రాష్ట్రంలో ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో రూ.1.56 కోట్లతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్యం నూతన భవనాన్ని జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆస్పత్రుల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం నిధులను విడుదల చేస్తోందన్నారు. శిథిలావస్థకు చేరిన భవనాలను కూల్చివేయాలని ఆదేశించారు. ఆస్పత్రి పరిసరాలను శుభ్రంగా ఉంచడంతోపాటు రోగులకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ విజయ్‌కుమార్, ఎంపీపీ వసంత, కలెక్టర్ నారాయణరెడ్డి, ఆర్డీఓ వాసుచంద్ర, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి పల్వన్‌కుమార్. జెడ్పీ సీఈఓ సుధీర్, తహసీల్దార్ మనోహర్ చక్రవర్తి, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ యాదగిరి, వైద్యాధికారి సుజల, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శంకర్, బీజేపీ మండల అధ్యక్షుడు లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ధారూరు: విద్యార్థినులకు యూనిఫాం అందజేస్తున్న ప్రసాద్‌కుమార్, సునీతారెడ్డి, చిత్రంలో కలెక్టర్

బాలికలేం తక్కువ కాదు

బంట్వారం: బాలికలు.. బాలుర కంటే తక్కువేమీ కాదని, వారు కూడా అన్ని రంగాల్లో సమానంగా పోటీ పడుతున్నారని స్పీకర్ ప్రసాద్‌కుమార్ అన్నారు. జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా పీఎల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం నగరంలోని ఆయన నివాసంలో వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆడపిల్లలను పుట్టనిద్దాం, బతకనిద్దాం, చదవనిద్దాం, ఎదగనిద్దాం అనే నినాదంతో ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలన్నారు. ఆడపిల్లల పట్ల వివక్ష సరికాదన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రాములు యాదవ్, పెద్దేముల్ జెడ్పీటీసీ ధారాసింగ్, పీఎల్ ఫౌండేషన్ ప్రతినిధి డాక్టర్ లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నకిలీ పత్తి విత్తనాల సీజ్‌



పోలీసుల సీజ్‌ చేసిన నకిలీ విత్తనాలు

దౌల్తాబాద్‌: నకిలీ పత్తి విత్తనాలు విక్రయిస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు అరెస్ట్‌ చేశారు. ఎస్‌ఐ శ్రీశైలం తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని కుదరుమళ్ల గ్రామంలో కమ్మరి వెంకటేశ్వర్లు నకిలీ పత్తి విత్తనాలు విక్రయిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం అందిందన్నారు. ఈ మేరకు ఆయన ఇంటిపై పోలీసులు దాడులు చేసి 19.50 క్వింటాళ్ల పత్తి విత్తనాలు సీజ్‌ చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

జల్‌పల్లి తైబజార్‌ వేలం

రూ.9.90 లక్షలు పలికిన వైనం

పహాడీషరీఫ్‌: జల్‌పల్లి మున్సిపాలిటీ తైబజార్‌ వేలం రూ.9.90 లక్షలుగా పలికింది. మున్సిపాలిటీ చైర్మన్‌ అబ్దుల్లా సాది అధ్యక్షతన కమిషనర్‌ వాణిరెడ్డి సమక్షంలో బుధవారం నిర్వహించిన వేలంలో ఒకే ఒక్క ఔత్సాహికుడు షేక్‌ అమేర్‌ ముందుకు రావడంతో గతేడాది కంటే 10 శాతం ఎక్కువ రుసుంగా నిర్ణయించారు. ఈ సందర్భంగా కమిషనర్‌ మాట్లాడుతూ.. తైబజార్‌ దక్కించుకున్నవారు వచ్చే ఏడాది మార్చి 31వ తేదీ వరకు వీధి వ్యాపారుల వద్ద రుసులను వసూలు చేసుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. తాము సూచించినంత మేరకే వ్యాపారుల నుంచి డబ్బులు వసూలు చేయాలన్నారు. ఈ ఏడాదిలో ఎన్నికల కోడ్‌ కారణంగా ఏప్రిల్‌లో నిర్వహించాల్సిన వేలంను ఇప్పుడు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో ఆర్‌వో సుదర్శన్‌, మేనేజర్‌ నిర్మల, కౌన్సిలర్‌ లక్ష్మీనారాయణతో పాటు అలీ మసూరీ అలీ, బర్కత్‌ అలీ, దూడల శ్రీనివాస్‌ గౌడ్‌, నవీన్‌ గౌడ్‌, శివ తదితరులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో 23 గొర్రెల మృత్యువాత



గొర్రెల కళేబరాల వద్ద బాధితుడు

ఇబ్రహీంపట్నం: ఊర కుక్కల దాడిలో 24 గొర్రెలు మృత్యువాత పడిన సంఘటన ఇబ్రహీంపట్నంలో బుధవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. ఫిర్జాదిమహిల్‌కు చెందిన ఎస్‌డీ యాజాక్‌కు ఇంటి సమీపంలో గొర్రెల షెడ్‌ ఉంది. మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత కుక్కలు జీవాల మందపై పడ్డాయి. ఈ ఘటనలో 23 జీవాలు మృతిచెందగా.. మరో మూడు ప్రాణాపాయ స్థితిలో ఉన్నాయి. పశుసంవర్థక శాఖ అధికారులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ప్రభుత్వ పరంగా పరిహారం ఇప్పించి ఆదుకోవాలని బాధితుడు కోరాడు.

నిర్మాణాలకు సరైన ఎంపిక 'భారతి'

సంస్థ సీనియర్‌ టెక్నికల్‌ ఇంజనీర్‌ బద్రి

అబ్దుల్లాపూర్‌మెట్‌: సిమెంట్‌ వ్యాపారంలో తిరుగులేని సంస్థగా ఎదుగుతున్న భారతి సిమెంట్‌ అల్ట్రాఫాస్ట్‌ పేరుతో ఫాస్ట్‌ సెట్టింగ్‌ సిమెంట్‌ 5స్టార్‌ గ్రేడ్‌ను విడుదల చేసిందని ఆ సంస్థ సీనియర్‌ టెక్నికల్‌ ఇంజనీర్‌ బద్రి తెలిపారు. పెద్దఅంబర్‌పేటలోని స్టీల్‌ హౌస్‌ డీలర్‌ షాప్‌లో బుధవారం రాత్రి తాపీమేస్త్రీలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మార్కెట్‌లో లభించే ఇతర సిమెంట్‌తో పోలిస్తే భారతి అల్ట్రాఫాస్ట్‌తో నిర్మాణ ప్రక్రియ చాలా వేగవంతంగా పూర్తవుతుందన్నారు. ఇది ముఖ్యంగా స్లాబులు, పిల్లర్లు, బ్రిడ్జిలు, రహదారులకు సరైన ఎంపిక అని పేర్కొన్నారు. అల్ట్రాఫాస్ట్‌ వినియోగదారులకు ఉచిత సాంకేతిక సహాయం అందచేస్తామని స్లాబ్‌ కాంక్రీట్‌ సమయంలో నిపుణులైన భారతి సిమెంట్‌ ఇంజనీర్లు సైట్‌ వద్దకే వచ్చి సహాయపడుతారని తెలిపారు. డీలర్లు లింగస్వామి, రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. భారతి సిమెంట్‌ సర్వీస్‌ చాలా వేగంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేనేజర్‌ మార్కెటింగ్‌ రామకృష్ణ, టెక్నికల్‌ ఆఫీసర్స్‌ షాహెర్‌, నర్సింహులు, తాపీమేస్త్రీలు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

షాబాద్‌: మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్‌ స్కూల్‌, జూనియర్‌ కళాశాలలో టీచర్‌ పోస్టుల భర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన్‌ విడుదల చేసిందని ప్రిన్సిపాల్‌ శ్రీ వాచ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. షాబాద్‌లోని తెలంగాణ మోడల్‌ స్కూల్‌, కళాశాలలో టీజీటీ, పీజీటీ పోస్టులకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని తెలిపారు. ఏడు టీజీటీ (తెలుగు-1, ఇంగ్లీష్‌-1, హిందీ-2, మ్యాథ్స్‌-1, సోషల్‌-1, సైన్స్‌-1) పోస్టులు మరియు 10 పీజీటీ (తెలుగు-2, మ్యాథ్స్‌-2, బాటనీ-2, జువాలజీ-1, సివిక్స్‌-1, కామర్స్‌-1) పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వెల్లడించారు. అభ్యర్థులు రెండు రోజుల్లో సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూకు హాజరు కావాలని కోరారు. నిర్దేశించిన అర్హతలు, అనుభవం ప్రాతిపదికగా మెరిట్‌ అభ్యర్థులను ఎంపిక చేస్తామని తెలిపారు. ఇతర వివరాల కోసం మోడల్‌ స్కూల్‌లో, ఫోన్‌ నం. 99634 25217లో సంప్రదించాలని కోరారు.



ఎమ్మార్సీకి చేరిన పాఠ్యపుస్తకాలు



యూనిఫాంలను ఎంఈఓకు అందజేస్తున్న ఎంపీడీఓ తదితరులు

పునఃప్రారంభం నాటికే పుస్తకాలు

- ఈ ఏడాది సమస్య లేనట్లే
- ఆయా పాఠశాలకు పూర్తిస్థాయిలో అందిన పాఠ్య, నోట్‌ పుస్తకాలు
- యూనిఫాంలు సైతం పంపిణీకి సిద్ధం

యాలాల: ప్రతీ ఏడాది ప్రభుత్వ పాఠశాలలకు చేరాల్సిన పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు సమయానికి చేరక విద్యార్థులు, ఉపాధ్యాయులు గతంలో ఇబ్బందులు పడేవారు. కానీ ఈ ఏడాది ఆ సమస్య లేనట్లే. ఇప్పటికే పూర్తి స్థాయిలో పాఠ్య పుస్తకాలు, నోట్‌ పుస్తకాలు ఎమ్మార్సీకి చేరగా.. అక్కడి నుంచి ఆయా పాఠశాలలకు పంపిణీ సైతం పూర్తయింది. ఇవి పంపిణీకి సిద్ధంగా ఉన్నాయి.

వర్క్‌బుక్స్‌ సైతం

మండల పరిధిలో కస్తూర్బా గాంధీ పాఠశాలతో పాటు పది ఉన్నత పాఠశాలలు, 50 ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలున్నాయి. ఆయా పాఠశాలల విద్యార్థులకు సంఖ్యానుసారం ఇటీవల 29,900 పాఠ్యపుస్తకాలు, 29,900 నోట్‌ పుస్తకాలు వచ్చాయి. వీటితో పాటు ఉన్నత తరగతి విద్యార్థులకు వర్క్‌ బుక్స్‌(అభ్యాస దీపికలు) పంపిణీ చేశారు. గతంలో ప్రతీసారి అరకొర పుస్తకాల పంపిణీతో విద్యా సంవత్సరం ఇబ్బందులతో కొనసాగేది. కానీ ఈ ఏడాది ఆ సమస్య లేకపోవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే అన్ని పాఠశాలలకు పూర్తి స్థాయిలో పుస్తకాలు చేరాయని ఎమ్మార్సీ సిబ్బంది తెలిపారు.

ఏపీసీ కమిటీల ఆధ్వర్యంలో యూనిఫాంలు..

విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు సైతం ఈ ఏడాది పంపిణీకి సిద్ధంగా ఉంచారు. యూనిఫాంల తయారీ అమ్మ ఆదర్శ కమిటీలో భాగంగా సభ్యులైన డ్వాక్రా మహిళలకు జిల్లా స్థాయి అధికారులు అప్పగించారు. వేసవి సెలవుల్లో ఆయా గ్రామాల్లోని ఏపీసీ సభ్యులకు యూనిఫాంల తయారీ పని అప్పగించారు. ఈ యూనిఫాంలను విద్యాశాఖ అధికారులకు అందించారు. యాలాల మండల కేంద్రంలోని ఏపీసీ సభ్యులు పూర్తి చేసిన 5,900 జతల యూనిఫాంలను ఎంపీడీఓ, ఏపీఎం చేతుల మీదుగా ఎంఈఓకు అందించారు. పాఠశాలల కమిటీల ఆధ్వర్యంలో పూర్తైన యూనిఫాంలను పాఠశాలలకు అందించనున్నట్లు అధికారులు తెలిపారు.

పూర్తిస్థాయిలో పంపిణీ చేస్తాం

ఈ ఏడాది అన్ని పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు, నోట్‌ పుస్తకాలు పంపిణీ అయ్యాయి. దాదాపు 90శాతానికి పైగా పాఠ్యపుస్తకాలు ఎమ్మార్సీకి చేరడంతో వివిధ పాఠశాలల సిబ్బంది సైతం పుస్తకాలను తీసుకెళ్లారు, పుస్తకాలతో పాటు యూనిఫాంలను పూర్తి స్థాయిలో అందించనున్నాం. బడిబాట కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల తల్లిదండ్రులకు అన్ని విషయాలను వివరించి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలని సూచిస్తున్నాము.

– సుధాకర్‌రెడ్డి, ఎంఈఓ, యాలాల

'జుంటుపల్లి' అభివృద్ధికి చర్యలు

చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

యాలాల: మండల పరిధిలోని జుంటుపల్లి ప్రాజెక్టు అభివృద్ధికి చర్యలు తీసుకుంటానని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన ఎంపీపీ బాలేశ్వర్‌గుప్తాతో కలిసి ప్రాజెక్టును సందర్శించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు రెండు తూములు మరమ్మతులకు గురై నీరు వృథా అవుతుందని రైతులు ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. దాదాపు 2,200 ఎకరాల ఆయకట్టు కలిగిన భారీ ప్రాజెక్టుకు మరమ్మతులు లేక కాల్వలు, తూములు, అలుగు దెబ్బతిందన్నారు. గతంలో ఎన్నడు లేనంతగా ఈ ఏడాది ప్రాజెక్టులో నీరు అడుగంటిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాకాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో ప్రాజెక్టు తూముకు మరమ్మతులు చేపడితే వరద నీరు వృథా కాదన్నారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించి చర్యలు తీసుకుంటానన్నారు. ఈ కార్యక్రమంలో ఆయకట్టు రైతులు, గ్రామస్తులు ఉన్నారు.



మరమ్మతులకు గురైన తూమును పరిశీలిస్తున్న ఎంపీ తదితరులు

పంచాయతీ కార్యదర్శులకు మెమో

- కలెక్టర్‌కు నివేదిక ఇచ్చిన ఎంపీడీఓ

తాండూరు రూరల్‌: విధుల్లో అలసత్వం వహించిన పంచాయతీ కార్యదర్శులపై తాండూరు ఎంపీడీఓ అసంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామాల్లో ఇంటింటికీ మిషన్‌ భగీరథ ఇంటి సర్వే చేపట్టాలని ఇప్పటికే కలెక్టర్‌ ఆదేశించారు. ప్రతీ ఇంటికి వెళ్లి వివరాలు సేకరించాలని చెప్పారు. మండల పరిధిలో పంచాయతీ కార్యదర్శులు ఒక్కో పంచాయతీలో 50 కుటుంబాలను సర్వే చేయాలని చెప్పారు. కానీ పంచాయతీ కార్యదర్శులు ఇందుకు భిన్నంగా వ్యవహరించారు. దీంతో 21 మంది పంచాయతీ కార్యదర్శులకు మెమో జారీ చేసినట్లు ఎంపీడీఓ విశ్వప్రసాద్‌ తెలిపారు. మరో ఆరుగురు పంచాయతీ కార్యదర్శులు విధి నిర్వాహణలో పూర్తిస్థాయిలో నిర్లక్ష్యంగా వ్యవహరించారు. వీరిలో మోన్యానాయక్‌, అమరేశ్వరి, ఇస్మాయిల్‌, శృతి, అంబిక, ప్రవీణా ఉన్నారు.వీరు మూడు రోజుల్లో మోమోలకు సంబంధించిన సమాధానం ఇవ్వాలన్నారు. ఈ నివేదికను డీపీఓకు అందజేస్తామన్నారు.

ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తా: డీఎల్‌పీఓ

పెద్దేముల్‌: మండల పరిధిలోని మన్‌సాన్‌పల్లి పంచాయతీ కార్యదర్శి సుధీర్‌కుమార్‌పై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని తాండూరు డివిజన్‌ డీఎల్‌పీఓ శంకర్‌నాయక్‌ అన్నారు. బుధవారం ఆయన మిషన్‌ భగీరథ ఇంటింటి సర్వేను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉదయం 10గంటలకు ఆయన గ్రామానికి చేరుకోగా కార్యదర్శి విధులకు హాజరవ్వలేదు. 11గంటలకు రావడంతో ఆయన తీరుపై డీఎల్‌పీఓ మండిపడ్డారు. కాగా అదే సమయంలో గ్రామస్తులు వారంలో ఒక రోజుకూడా విధులు హాజరవ్వడని.. గ్రామ సమస్యలు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని.. ఇదే విషయాన్ని మండలాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని డీఎల్‌పీఓకు వివరించారు. ఆయన ఇదే విషయాన్ని జిల్లా పంచాయతీ అధికారికి, కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానన్నారు. ఆయన వెంట ఇన్‌చార్జి ఎంపీఓ రమేశ్‌ ఉన్నారు.



పెద్దేముల్‌: మన్‌సాన్‌పల్లి గ్రామస్తులతో మాట్లాడుతున్న శంకర్‌నాయక్‌

భయం.. భయంగా బడికి

కేజీ టూ పీజీ విద్యావిధానమైనా.. మన ఊరు మన బడి.. తీసుకువచ్చినా సర్కార్‌ బడుల సమస్యలు మాత్రం పరిష్కారమవ్వడం లేదు. ఓ వైపు పాలకులు ఉపన్యాసాలతో ఊదరగొడుతున్నా క్షేత్ర స్థాయిలో అవి కనిపించడం లేదు. ప్రభుత్వ పాఠశాలలు శిథిలావస్థకు చేరడంతో పాటు సౌకర్యాల లేమితో ప్రభుత్వ పాఠశాలకు వెళ్లాలంటే విద్యార్థులు, తల్లిదండ్రులు నిరాసక్తతో ఉన్నారు.

- పెచ్చులూడుతున్న భవనం పైకప్పులు
- తరగతి గదుల్లోకి వర్షపు నీరు
- గోడలు ముట్టుకుంటే విద్యుత్‌ సరఫరా
- పాఠశాలకు వెళ్లాలంటే జంకుతున్న విద్యార్థులు



శిథిలావస్థలో హస్నాబాద్‌ జెడ్పీహెచ్‌ఎస్‌

దుద్యాల్‌: ఎనభైఏళ్ల క్రితం నిర్మించిన పాఠశాల భవనం శిథిలావస్థకు చేరింది. గోడలకు పాకురు, తరగతి గదుల్లో పెచ్చులూడడంతో ఇనుప చువ్వలు తేలి ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వాలు, పాలకులు మారుతున్నా పాఠశాల అభివృద్ధిని పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. మండల పరిధిలోని హస్నాబాద్‌ జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాల, బాలికల ప్రాథమికోన్నత పాఠశాలలోనే రెండు పాఠశాలల భవనాలు నిర్మించారు. దాదాపు 80 ఏళ్ల పైమాటే కావడంతో భవనాలు శిథిలావస్థకు చేరుకుని పైకప్పు పెచ్చులూడి తరగతి గదులలో పిల్లలపై పడుతున్నాయి. గత వర్షాకాలంలో ఉన్నత పాఠశాల భవనం గోడలు తడిచి పాకురు పట్టి విద్యుత్‌ షాక్‌ వచ్చిందని ఉపాధ్యాయులు, విద్యార్థులు వాపోతున్నారు. దీంతో పాఠశాలకు వచ్చేవిద్యార్థులకు ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని భయాందోళనకు గురువుతున్నారు. గతేడాది విద్యార్థులపై, ఉపాధ్యాయులు భోజనం చేస్తున్న సమయంలో ప్లేట్‌లలో పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏళ్ల నుంచి ఏకరువు పెట్టినా పట్టించుకోవడం లేదని తల్లిదండ్రులు, విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో 220 మంది విద్యార్థులు, బాలికల ప్రాథమికోన్నత పాఠశాలలో 110 మంది విద్యార్థులున్నారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి నియోజకవర్గంలోని గ్రామం అవ్వడంతో నిధులు మంజూరు చేసి కొత్త భవనాలు నిర్మిస్తారని ఆశగా ఎదురు చూస్తున్నారు.

విద్యుత్‌ షాక్‌తో ఆందోళన

భవనాలు శిథిలావస్థకు చేరాయి. వర్షాలకు తరగతుల గోడలు పాకురుపడుతున్నాయి. దీనికి తోడుగా విద్యుత్‌ షాక్‌ వస్తోందని విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతేడాది విద్యుత్‌ షాక్‌ రావడంతో విద్యార్థులంతా పరుగులు పెట్టారని ఉపాధ్యాయులు వెల్లడిస్తున్నారు.



ప్రాథమిక పాఠశాల తరగతి గదిలో పెచ్చులూడిన పైకప్పు

నూతన భవనం నిర్మించాలి



పాఠశాల శిథిలావస్థకు చేరి పైకప్పు నుంచి పెచ్చులూడుతున్నాయి. వర్షాకాలంలో గోడలు విద్యుత్‌ సరఫరా అయి షాక్‌ కొడుతోంది. దీంతో గత విద్యాసంవత్సరం ఆందోళనతో బయటకు పరుగెత్తాం. నూతన భవనం నిర్మించి సమస్యకు పరిష్కారం చూపాలి.

– వి.శివ కుమార్‌, 7వ తరగతి, జెడ్పీహెచ్‌ఎస్‌, హస్నాబాద్‌

భయంగా వెళ్తున్నాం



పాఠశాలకు వెళ్లాలంటే భయంగా ఉంది. పాఠశాల భవనం శిథిలావస్థకు చేరింది. భవనం పైకప్పు పెచ్చులూడి మీదపడుతున్నాయి. భారీ వర్షాలకు తట్టుకోలేక భవనం సైతం కూలి పోతేందోమోనని భయపడుతున్నాం.

– నికిత, 5వ తరగతి, జీయూపీఎస్‌, హస్నాబాద్‌

నకిలీ జర్దా స్థావరంపై దాడులు

18 కిలోల విడి జర్దా, సామగ్రిని స్వాధీనం చేసుకున్న ఎస్‌ఓటీ పోలీసులు

పహాడీషరీఫ్‌: బాలాపూర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో నకిలీ జర్దా తయారీ కంపెనీపై మహేశ్వరం జోన్‌ ఎస్‌ఓటీ పోలీసులు బుధవారం దాడులు నిర్వహించారు. నిర్వాహకుడితో పాటు ఇద్దరు కార్మికులను అరెస్ట్‌ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వాదే ఉమర్‌ కాలనీలో పాతబస్తీ ఫలక్‌నుమాకు చెందిన సయ్యద్‌ ఇర్ఫాన్‌(45) గత కొన్ని రోజులుగా ఎం-గోల్డ్‌ కంపెనీకి చెందిన జర్దా ముసుగులో నకిలీ జర్దా తయారు చేస్తున్నాడు. యూపీకి చెందిన ఇద్దరు కార్మికులు హరిశంకర్‌ రాజ్‌పుత్‌(29), విక్రంసిన్హ పర్మార్‌(30)లను కార్మికులుగా పెట్టుకొని ఈ వ్యవహారం కొనసాగిస్తున్నాడు. దీనిపై విశ్వసనీయ సమాచారం అందుకున్న మహేశ్వరం ఎస్‌ఓటీ పోలీసులు దాడులు చేసి నిర్వాహకుడితో పాటు కార్మికులను అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి 18 కిలోల విడి జర్దా, ఒక కిలో పుదీనా, రెండు కిలోల హిమాం లిక్విడ్‌, నాలుగు రోజ్‌ వాటర్‌ బాటిళ్లు, 46,560 జర్దా ప్యాకెట్లు, ఎం గోల్డ్‌ రెండు రోలర్స్‌, నాలుగు కాటన్ల ఎం గోల్డ్‌ ఖాళీ బాక్స్‌లు, తయారీ యూనిట్‌, తూకం, రెండు వేడి చేసే మిషన్లు, రెండు కిలోల ప్లాస్టిక్‌ ప్యాకింగ్‌ కవర్లు, ఒక హోండా యాక్టివా, మూడు మొబైల్‌ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులతో పాటు పట్టుబడ్డ సామగ్రిని తదుపరి విచారణ నిమిత్తం బాలాపూర్‌ పోలీసులకు అప్పగించారు.



నకిలీ జర్దా ప్యాకెట్లతో పట్టుబడిన నిందితులు

లైటింగ్‌ ఏర్పాటు.. వివాదాస్పదం



రోడ్డు మధ్యలో విద్యుత్‌ స్తంభాలకు ఏర్పాటు చేసిన లైటింగ్‌ (ఫైల్‌)

తీర్మానం లేకుండానే రూ.12 లక్షలు ఖర్చు చేసిన బడంగ్‌పేట్‌ మున్సిపల్‌ అధికారులు

బడంగ్‌పేట్‌: ఎలాంటి తీర్మానం చేయకుండా బడంగ్‌పేట్‌ మున్సిపల్‌ కార్పొరేషన్‌లో రూ.12 లక్షలు ఖర్చు చేయడం వివాదాస్పదంగా మారింది. గతంలో కార్పొరేషన్‌లో తెలంగాణ దశాబ్ది ఉత్సవాల కార్యక్రమాన్ని మూడు రోజులు ఘనంగానే నిర్వహించారు. ఉత్సవాలు ముగిసిన తర్వాత బడంగ్‌పేట్‌ కమాన్‌ నుంచి గాంధీనగర్‌ వరకు రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్‌ స్తంభాలకు లైట్లను ఏర్పాటు చేశారు. ఈ మేరకు రూ.12 లక్షలు కేటాయించి ఓ కాంట్రాక్టర్‌కు అప్పగించారు. దీనిపై ఎలాంటి తీర్మానం చేయకుండా మున్సిపల్‌ అధికారులు ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. సాధారణంగా రూ.లక్షకు పైగా నగదు డ్రా చేయాలంటే మున్సిపల్‌ పాలక సభ్యులతో కూడిన తీర్మానం అవసరం. అలాంటిది ఎవరికీ తెలియకుండా విద్యుత్‌ లైట్ల పేరుతో ప్రజా ధనాన్ని ఖర్చు చేయడం ఎంత వరకు సబబు అనిస్థానికులు ప్రశ్నిస్తున్నారు. దీనిపై వివరణ కోరేందుకు కమిషనర్‌ను సంప్రదించగా అందుబాటులోకి రాలేదు.

మున్సిపల్‌ ఆఫీస్‌ ముట్టడిస్తాం



అధికారులు, పాలకులకు ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసే హక్కు ఎవరిచ్చారు? సమస్యలతో కాలనీలు సతమతం అవుతుంటే రూ.12 లక్షలు ఎలా ఖర్చు చేస్తారు? అనుమతులు లేకుండా ప్రజలు కట్టిన సొమ్మును విచ్చలవిడిగా ఖర్చు చేస్తున్న అధికారులను అందుకు ప్రోత్సహిస్తున్న పాలకులపై చర్యలు తీసుకోవాలి. లేకుంటే బీజేవైఎం ఆధ్వర్యంలో మున్సిపల్‌ కార్యాలయాన్ని ముట్టడిస్తాం.

– రామకృష్ణారెడ్డి, బీజేవైఎం, కార్పొరేషన్‌ అధ్యక్షుడు

పనికి వెళ్లిన వ్యక్తి అదృశ్యం



అంకంరావ్‌ (ఫైల్‌)

పహాడీషరీఫ్‌: పనికి వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన పహాడీషరీఫ్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తుక్కుగూడ గ్రామానికి చెందిన అంకం రావ్‌(34) 20 రోజుల క్రితం పని నిమిత్తం బైక్‌పై అల్వాల్‌కు వెళ్లాడు. ఈ నెల 7వ తేదీన భార్య నాగశేషమ్మకు ఫోన్‌ చేసి మాట్లాడాడు. అనంతరం అతని ఫోన్‌ స్విచ్చాఫ్‌ కావడంతో పని దగ్గరికి వెళ్లి అడగడంతో ఇంటికి వెళుతున్నానని నాలుగు రోజుల క్రితం చెప్పి వెళ్లాడని తోటి కార్మికులు తెలిపారు. దీంతో నాగశేషమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు పోలీస్‌స్టేషన్‌లో గాని 87126 62367 నంబర్‌లో సమాచారం అందించాలని పోలీసులు తెలిపారు.

11 క్వింటాళ్ల బియ్యం పట్టివేత

యాచారం: అక్రమంగా దాచిపెట్టిన రేషన్‌ బియ్యాన్ని రాచకొండ ఎస్‌ఓటీ పోలీసులు పట్టుకున్నారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని చౌదర్‌పల్లి గ్రామంలో గురుప్రసాద్‌ అనే వ్యాపారి ఇంట్లో రేషన్‌ బియ్యం నిల్వలు ఉన్నట్లు ఎస్‌ఓటీ పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు రాచకొండ ఎస్‌ఓటీ పోలీసులు బుధవారం ఉదయం గురుప్రసాద్‌ ఇంట్లో తనిఖీలు చేయగా 11 క్వింటాళ్ల రేషన్‌ బియ్యం అక్రమంగా నిల్వ ఉన్నట్లు గుర్తించారు. వెంటనే బియ్యాన్ని స్వాధీనం చేసుకుని యాచారం పోలీసులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శంకర్‌కుమార్‌ తెలిపారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్‌

- పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించండి
- జిల్లా కలెక్టర్‌ శశాంక

షాద్‌నగర్‌ రూరల్‌: విద్యతోనే ఉజ్వల భవిష్యత్‌ లభిస్తుందని.. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి తమ లక్ష్యాలను చేరుకోవాలని కలెక్టర్‌ శశాంక సూచించారు. ఫరూఖ్‌నగర్‌ మండల పరిధిలోని మొగిలిగిద్ద జెడ్పీహెచ్‌ఎస్‌లో బుధవారం పాఠశాలల పునఃప్రారంభాన్ని పురస్కరించుకొని.. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌పుస్తకాలు, ఏకరూప దుస్తుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్‌ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రభుత్వం బడిబాట కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో నిర్వహిస్తోందని అన్నారు. ప్రభుత్వ బడుల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అనేక రకాల సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. జిల్లాలోని 1,308 ప్రభుత్వ బడుల్లో పునఃప్రారంభం అయిన మొదటి రోజున విద్యార్థులకు యూనిఫాంలతో పాటు పాఠ్యపుస్తకాలు, నోట్‌ బుక్‌లు అందించామన్నారు. అనంతరం జెడ్పీ చైర్‌పర్సన్‌ తీగల అనితారెడ్డి, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ మాట్లాడుతూ.. పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని కోరారు. ప్రభుత్వం పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ వెంకట్‌రాంరెడ్డి, ఎంపీటీసీల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కావలి శ్రీశైలం, డీఈఓ సుశీందర్‌రావు, డీఆర్‌డీఏ పీడీ శ్రీలత, సీడీపీఓ నామణి, ఎంఈఓ శంకర్‌ రాథోడ్‌, తహసీల్దార్‌ పార్థసారథి, ఎంపీడీఓ బన్సీలాల్‌, అంగన్‌వాడీ సూపర్‌ వైజర్‌ విజయలక్ష్మి, కాంగ్రెస్‌ నాయకులు.. చల్లా శ్రీకాంత్‌ రెడ్డి, బాల్‌రాజ్‌గౌడ్‌, తిరుపతిరెడ్డి, గ్రామస్తులు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పాఠ్యపుస్తకాలు, యూనిఫాం అందజేస్తున్న రంగారెడ్డి కలెక్టర్‌ శశాంక, అనితారెడ్డి, శంకర్‌

కార్పొరేట్‌కు దీటుగా బోధన

మహేశ్వరం: ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్‌కు దీటుగా బోధన అందిస్తున్నామని జెడ్పీ చైర్‌పర్సన్‌ తీగల అనితారెడ్డి పేర్కొన్నారు. మహేశ్వరం ప్రభుత్వ పాఠశాలలో బుధవారం విద్యార్థులకు ఆమె యూనిఫాం, పుస్తకాలను పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ... కాంగ్రెస్‌ ప్రభుత్వం విద్యాభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. ప్రభుత్వ బడుల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీపీ సునీతా నాయక్‌, ఎంపీడీఓ శైలజ, మండల విద్యాధికారి కృష్ణ, ఏపీఎం సత్యనారాయణ, మాజీ ఎంపీపీ పాండు నాయక్‌, హర్షగూడ ఎంపీటీసీ విజయ్‌ నాయక్‌, శివగంగ రాజరాజేశ్వర ఆలయ కమిటీ చైర్మన్‌ కుమార్‌, కాంగ్రెస్‌ నాయకులు పాల్గొన్నారు.